క్లుప్తంగా

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి



పురుగుమందు డబ్బాలు పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి మోహన్‌కృష్ణ

రామభద్రపురం: ఉద్యాన పంటల్లో పురుగు మందులు, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని మండల ఉద్యాన శాఖాధికారి పి.మోహన్‌కృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని ఉద్యాన పంటలను ఆయన బుధవారం పరిశీలించారు. పొట్టి చిక్కుడు పంటకు ఏయే మందులు పిచికారీ చేస్తున్నారో రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే వారు పిచికారీ చేస్తున్న పురుగు మందుల డబ్బాలను పరిశీలించారు. అధిక మోతాదులో పురుగు మందులు వినియోగించకూడదని తెలిపారు.

స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలి



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో సిబ్బంది

తెర్లాం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులంతా జిల్లా ఆంగ్ల భాషోపాధ్యాయుల సంఘం(డెల్టా) ఆధ్వర్యంలో తయారు చేసిన ఇంగ్లిష్ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు, నందబలగ హైస్కూల్ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు మింది విజయమోహనరావు కోరారు. మండలంలోని నందబలగ హైస్కూల్‌లో ఇంగ్లిష్ స్టడీ మెటీరియల్ పంపిణీ బుధవారం చేపట్టారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో సీ, డీ గ్రేడ్‌లలో ఉన్న విద్యార్థులకు సులువుగా ఇంగ్లిష్ వ్యాకరణం, పదాలు, ప్రశ్నలు–జవాబులు అర్థమయ్యే రీతిలో ఈ స్టడీ మెటీరియల్‌ను తయారు చేయడం జరిగిందన్నారు. పదో తరగతి విద్యార్థులందరికీ ఈ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన

రేగిడి: మండలంలోని ఆమదాలవలస భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను రాష్ట్ర సహిత విద్య సహాయక సమన్వయకర్త ఎల్.అమ్మినాయుడు బుధవారం పరిశీలించారు. ప్రతీ విద్యార్థి ఆరోగ్యంతో పాటు చదువు మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రసాదరావు, జిల్లా కో–ఆర్డినేటర్ సూర్యారావు, మండల కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
రాజాం: స్థానిక భవిత కేంద్రాన్ని సహిత విద్య స్టేట్ కో–ఆర్డినేటర్ అమ్మినాయుడు, జిల్లా కో–ఆర్డినేటర్ సూర్యారావులు కలిసి బుధవారం సందర్శించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి, అందుతున్న సదుపాయాలపై ఆరాతీశారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

రేగిడి: వైద్య తనిఖీల నిమిత్తం స్థానిక పీహెచ్‌సీకి బుధవారం వచ్చిన గర్భిణులకు సత్యసాయి భజన మండలి సభ్యులు, భక్తులు పౌష్టికాహారం అందజేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి, రోజంతా ఆస్పత్రిలోనే వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి వస్తుండడంతో వారి ఆకలి తీర్చేందుకు నెలనెలా ఇలా అన్నదానం చేస్తున్నామని భక్తులు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా సంపద తయారీ కేంద్రాలు

రాజాం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఎంజేవలస, బొమ్మినాయుడువలస, గార్రాజుచీపురుపల్లి తదితర గ్రామాల్లోని సంపద తయారీ కేంద్రాలను ఆయన బుధవారం పరిశీలించారు. పంచాయతీలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ప్రజలకు తడిచెత్త, పొడిచెత్తపై అవగాహన కల్పించాలని తెలిపారు.

శ్మశానవాటికకు రోడ్డు కేటాయింపు

బొబ్బిలిరూరల్: మండలంలోని డొంగురువలస గ్రామంలో శ్మశానవాటికకు వెళ్లేందుకు అవసరమైన రోడ్డును ఆర్డీవో రామ్మోహనరావు బుధవారం కేటాయించారు. గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామస్తులు విజ్ఞప్తి మేరకు ప్రభుత్వానికి చెందిన 10 సెంట్ల స్థలాన్ని రోడ్డుకు కేటాయిస్తున్నట్లు స్పష్టం చేశారు. త్వరలోనే రోడ్డు పనులు చేపట్టాలని ఆర్డీవో అధికారులను ఆదేశించారు.

'పొలం పిలుస్తోంది'

సంతకవిటి: మండలంలోని జి.ఎస్.పురం, వాల్తేరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏవో పైల నవీన్ మాట్లాడుతూ మినప సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. అనంతరం వివిధ పంటల రక్షణకు చేపట్టాల్సిన చర్యలను రైతులకు వివరించారు.

- పెసర, మినప పంటలకు డిమాండ్
- నియోజకవర్గంలో 8 వేల ఎకరాల్లో సాగు
- అధిక దిగుబడులతో సాగుపై రైతుల ఆసక్తి



వంగర సమీప పొలాల్లో మినప సాగు

అపరాల సాగు.. లాభాలు బాగు!



ఒమ్మి గ్రామ సమీప పొలంలో విరగ్గాసిన పెసర పంట

రాజాం: ముందస్తు అపరాల పంటల సాగుతో రైతులకు లాభాలు వస్తున్నాయి. రాజాం నియోజకవర్గంలో మెట్టు ప్రాంతాల్లో ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న, చోడి, వేరుశనగ తదితర పంటలు సాగు చేసిన ప్రాంతాలతో పాటు వరి సాగు చేసిన పొలాల్లో రబీ సీజన్‌లో అపరాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ సాగులో భాగంగా ముందస్తుగా మెట్టు ప్రాంతాల్లో వేసిన మినప, పెసర, చోడి, ఉలవ తదితర పంటలు ప్రస్తుతం పూత దశకు వచ్చాయి. ఇటీవల వాతావరణం అనుకూలించడంతో పంట మంచి పూత దశకు రావడంతో మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

నియోజకవర్గంలో 8 వేల ఎకరాల్లో..

రాజాం నియోజకవర్గంలో రేగిడి, రాజాం, వంగర, సంతకవిటి మండలాల్లో అపరాల పంటలు సాగు అధికంగా కనిపిస్తోంది. ఈ ఏడాది 8 వేల ఎకరాల్లో అపరాల పంటలు సాగులో ఉన్నాయి. రాజాం, వంగర ప్రాంతాల్లోని పంటలు ప్రస్తుతం కోత దశకు చేరుకున్నాయి. మినప, పెసర పంటలు బాగా పండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

మార్కెట్‌లో మంచి డిమాండ్..

ప్రస్తుతం మినప, పెసర పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఎకరా సాగులో 4 నుంచి 5 క్వింటాళ్ల మినప దిగుబడి, మూడున్నర నుంచి నాలుగు క్వింటాళ్ల పెసర దిగుబడి ఉంది. క్వింటా పెసలు మార్కెట్‌లో రూ. 8 వేలు పలుకుతుండగా, మినుములు క్వింటా ధర రూ.7500 నుంచి 8 వేలు మధ్య ధర పలుకుతోంది. స్థానికంగా మిల్లర్లు, దళారులు ఈ పంటలను హాట్ కేకుల్లా కొనుగోలు చేస్తున్నారు. రైతుల వద్ద పెద్దఎత్తున దళారులు కొనుగోలు చేసి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పెద్దగా పెట్టుబడి లేకుండా ఈ పంట చేతికందుతుండడంతో రైతులకు మంచి ఆదాయం కలిసివస్తోంది.

పంట బాగుంది..

ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన మినప పంట చాలా బాగుంది. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. నూర్పిడి అనంతరం కల్లాల్లోనే పంటను రైతులు కొనుగోలు చేస్తున్నారు. స్థానికంగానే విక్రయాలు జరుగుతున్నాయి. ఎకరా సాగులో నాలుగు క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చింది.

–గెద్దాపు రామారావు, రైతు, కంచరాం, రాజాం మండలం

క్వింటా పెసలు రూ.7,800..

మా పొలాల్లో నల్లపెసర పంట సాగు చేస్తున్నాం. ఎకరా సాగులో మూడున్నర క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మంచుకు దొరక్కుండా పంటను కాపాడాం. క్వింటా పంట ధర రూ. 7,800 చొప్పున కొనుగోలు చేశారు.

–మామిడి రాము, వంగర

● 'మత్తు'తో జీవితం చిత్తు



మత్తు పదార్థాలతో జీవితం చిత్తు(నాశనం) అవుతుందని, ప్రతిఒక్కరూ గంజాయి, మద్యం, ఖైనీ, గుట్కా, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ కె.నారాయణరావు సూచించారు. రామభద్రపురం మండలంలోని పలు పాఠశాలల్లోని విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఫ్యాషన్ మాయలో పడి యువత, విద్యార్థులు ఎక్కువగా చెడు అలవాట్లకు బానిసలై, తమ భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మంచి అలవాట్లు అలవర్చుకుని, ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు.

–రామభద్రపురం

● పనిభారం తగ్గించాలి



పనిభారం తగ్గించాలని గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారు వారి యూనియన్ మండల అధ్యక్షుడు ఆశపు వెంకటరావు సమక్షంలో వంగర మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట బుధవారం విలేకరులతో మాట్లాడారు. తమ విభాగానికి పరిమితులు లేకుండా అన్ని శాఖల విధులు, బాధ్యతలు అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకంటూ పదోన్నతుల చానల్ లేదన్నారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న టీఎంఎఫ్ బాధ్యతనూ ఉపాధ్యాయుల నుంచి వెల్ఫేర్ అసిస్టెంట్లకు బదలాయించడం అన్యాయమని నిలదీశారు. పని ఒత్తిడి కారణంగా సక్రమంగా సేవలందించలేకపోతున్నామన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు జి.రమేష్, డి.ప్రసాద్, రవి, నరేష్, సంతోష్ తదితరుల పాల్గొన్నారు.

–వంగర

● 100 రోజుల పని కల్పించాలి



ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న వేతనదారులకు 100 రోజుల పని కల్పించాలని ఎంపీడీవో రేగి రాంబాబు ఆదేశించారు. తెర్లాం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి ఏపీవో సుశీల ఆధ్వర్యంలో సాంకేతిక, క్షేత్ర సహాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో మాట్లాడుతూ మామిడి తోటల్లో ఫారంపాండ్‌ల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఫీడర్ చానల్ పనులను వేతనదారులతో చేయించాలన్నారు. మస్తర్లు సక్రమంగా వేయాలని, రికార్డులు పక్కాగా నిర్వహించాలని తెలిపారు. ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో కోరారు.

–తెర్లాం

నీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



తెర్లాం: ఉద్దవోలు పాఠశాలలో ఎన్నికల నోటిఫికేషన్ పత్రం ప్రదర్శిస్తున్న డిప్యూటీ తహసీల్దారు సత్యనారాయణ

తెర్లాం: మండలంలోని 18 సాగునీటి సంఘాలకు ఈ నెల 14వ తేదీన జరగనున్న ఎన్నికలకు సంబంధించి, ఎన్నికల నోటిఫికేషన్‌ను తహసీల్దారు హేమంత్‌కుమార్ ఆదేశాల మేరకు ఉప తహసీల్దారు గొంగాడ సత్యనారాయణ బుధవారం విడుదల చేశారు. మండలంలోని ఉద్దవోలు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ ఎన్నికల నోటిఫికేషన్ ప్రతులను వ్రేలాడదీశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా జరిగేందుకు రైతులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.
వంగర: మండలంలోని ఎనిమిది సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ అధికారులు విడుదల చేశారు. ఇరువాడ, అరసాడ, కింజంగి, రాజులగుమ్మడ, శివ్వాం, తలగాం తదితర సాగునీటి సంఘాల పరిధిలో 78 టీసీలకు కూడా ఈ ఎన్నిక జరగనుందన్నారు.
సంతకవిటి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈవో, ఏఈవో, పీవో, ఏపీవోలకు ఎన్నికల నిర్వహణపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో మొత్తం 19 సంఘాల పరిధిలో 165 టీసీలకు ఎన్నిక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.
బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి, నోటిఫికేషన్‌ను ఎంపీడీవో ఎస్.రామకృష్ణ బుధవారం జారీ చేశారు.
రేగిడి: సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని ఎన్నికల అధికారి, మడ్డువలస రిజర్వాయరు డీఈఈ నాగేశ్వరరావు సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీవోలు, ఏపీవోలకు ఒక్కరోజు శిక్షణ బుధవారం ఇచ్చారు. 14వ తేదీన జరిగే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో ఏ విధంగా నిర్వహించాలన్న విషయంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు చిన్నారావు, ఎంపీడీవో శ్యామలాకుమారి తదితరులు పాల్గొన్నారు.
రేగిడి: మండలంలోని మడ్డువలస కాలువకు సంబంధించి, నాలుగు సంఘాలు, మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి పది సంఘాలకు గాను సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు.

ప్రజాసమస్యలపై పోరుకు సిద్ధం కావాలి

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పిలుపు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్రంలోని ప్రజాసమస్యలపై వైఎస్సార్ సీపీ చేపడుతున్న పోరుకు అందరూ సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఇదే విషయమై స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడిన ఆయన.. ఈ నెల 13వ తేదీన కూటమి ప్రభుత్వ మోసాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, బాధిత ప్రజలంతా తరలిరావాలని కోరారు. ఎన్నికల సమయంలో అన్ని వర్గాలకు న్యాయం చేకూరుస్తామని చెప్పి, సూపర్ సిక్స్ హామీలు చంద్రబాబు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును మరిచారని విమర్శించారు. ఓ వైపు నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో ప్రజలు సతమతమవుతుంటే మరో వైపు విద్యుత్ చార్జీలు పెంచి జనంపై పెనుభారం వేస్తోందని దుయ్యబట్టారు. ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లో నగదు జమ చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ తన లాంటి వారికి కూడా మూడు రోజులైనా ట్రక్ షీట్లు తెగే పరిస్థితి లేదన్నారు. ఖరీఫ్ సాగు ముగిసి, రబీ సాగు ఆరంభమవుతున్నా ఇంతవరకు రైతులకు ఇస్తానన్న రూ.20 వేల పెట్టుబడి సాయం అందలేదన్నారు. ఇదిలా ఉంటే పంటలకు సంబంధించి, బీమా ప్రీమియంను రైతులే చెల్లించాలని ప్రభుత్వం చెబుతోందని దుయ్యబట్టారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుండడం సిగ్గుచేటన్నారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, వారే తగిన బుద్ధి చెబుతారన్నారు. ప్రజలకు న్యాయం జరిగేంత వరకు వైఎస్సార్ సీపీ తరఫున పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, తూముల రామసుధీర్, బాడంగి జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆనందరావు

రామభద్రపురం: రాష్ట్రంలో ప్రజాసమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో అధికారమే పరమావధిగా సూపర్ సిక్స్ హామీలను ఎరచూపి ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారని చంద్రబాబు సర్కారును విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోను మడత పెట్టి అటకెక్కించేశారని దుయ్యబట్టారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, కొన్ని లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, మోసం చేశారని మండిపడ్డారు. రైతులకు ఏటా రూ.20 వేల పెట్టుబడి సాయం ఇస్తానని చెప్పిన చంద్రబాబు ఇప్పటికీ ఇవ్వకపోవడం మోసం కాదా అని నిలదీశారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు ఒక్క రూపాయి కూడా పెంచబోమని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీల పెంచడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్ల వరకు గత ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తే ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ పథకాన్ని ఎత్తివేసి వారితోనూ బిల్లులు కట్టించాలని చూస్తోందని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా 2047 విజన్ గురించి మాట్లాడి ప్రజలను మోసం చేస్తోందని చంద్రబాబు సర్కారును విమర్శించారు. రాష్ట్రంలోని టీడీపీ పాలనకు ప్రధానమంత్రి మోదీ కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. మోదీ అండదండలతోనే రాష్ట్రంలోని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుంటే ఉద్యమాలు చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు లెంక లక్ష్మి, సామిరెడ్డి లక్ష్మణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

వంగర: మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని ఏపీఎం తెర్లి మంగమ్మ ఆకాంక్షించారు. మండలంలోని కొట్టిశ గ్రామంలో గ్రామ మహిళా సంఘాలతో బుధవారం ఆమె సమావేశమై, పలు సూచనలు చేశారు. వెలుగు ద్వారా మహిళలకు అందించే రుణాలను వివరించారు. రుణాలను సద్వినియోగం చేసుకుని, మహిళలు ఆర్థికంగా ఎదగాలని కోరారు.

సద్దుమణిగిన భూ వివాదం

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది, కాశిందొరవలస, రామన్నదొరవలస గ్రామాల రైతులు, దళితుల మధ్య నెలకొన్న భూ వివాదం సద్దుమణిగింది. 90 ఎకరాల భూమిపై తమకు హక్కు ఉందని కొందరు.. తమకు ప్రభుత్వం మంజూరు చేసిందని మరి కొంతమంది.. మూడు దశాబ్దాలుగా న్యాయం కోసం అధికారులను ఆశ్రయిస్తున్నారు. అయితే ఎట్టకేలకు తహసీల్దారు చొరవతో సమస్య పరిష్కారమైనట్లు తెలుస్తోంది.

తాగునీటి కుళాయిల ప్రారంభం

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో కొత్త ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలను సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ కలిసి బుధవారం ప్రారంభించారు. రూ.3.50 లక్షల 15వ ఆర్థికసంఘం నిధులతో కుళాయిలు ఏర్పాటు చేశామని సర్పంచ్ తెలిపారు.

అద్దె చెల్లించని దుకాణాలకు తాళాలు

రాజాం: స్థానిక ఎన్‌టీఆర్ కాంప్లెక్స్ ఆవరణలో స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించిన దుకాణాల్లో యజమానులు అద్దె చెల్లించని దుకాణాలకు అధికారులు బుధవారం తాళాలు వేశారు. నాలుగేళ్లుగా కొన్ని షాపుల అద్దెలను యజమానులు చెల్లించని కారణంగా వారికి నోటీసులు జారీ చేసి మరీ షాపులు మూసివేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. రూ.40 లక్షల మేర అద్దెలు రావాల్సి ఉందన్నారు.

నీటి పన్ను వసూళ్లకు చర్యలు

రాజాం సిటీ: పట్టణంలో కుళాయి నీటి పన్ను వసూళ్లకు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు అన్నారు. బుధవారం పలు వార్డుల్లో పర్యటించిన ఆయన.. పన్ను బకాయిలు చెల్లించని వారి ఇంటి ముందున్న కుళాయిల నుంచి నీరు రాకుండా సీల్ వేయించారు. ప్రతిఒక్కరూ నీటి పన్ను బకాయిలు చెల్లించేందుకు ముందుకురావాలని కోరారు.

వినతుల స్వీకరణ



తెర్లాం: నందబలగలో వినతిపత్రం స్వీకరిస్తున్న బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామగ్రామాన నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు వినతులు వెల్లువెత్తుతున్నాయి. భూ సరిహద్దు, విస్తీర్ణం, మ్యుటేషన్ సమస్యలు సహా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు, వివిధ ధ్రువపత్రాలకు సంబంధించి ప్రజల నుంచి అధికారులు బుధవారం వినతిపత్రాలు స్వీకరించారు. 40 రోజుల్లోగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, అప్పటికీ పరిష్కారం కాకపోతే మరోసారి జరిగే సదస్సుల్లో తమ దృష్టికి తీసుకువస్తే సత్వరమే చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్

రైతులను నట్టేట ముంచారు..

- మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్



పోరుబాట కరపత్రాలు విడుదల చేస్తున్న మాజీ ఎంపీ బెల్లాన, డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రాజాం: రైతులను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఈ నెల 13వ తేదీన పార్టీ తలపెట్టిన పోరుబాట కార్యక్రమ కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.20 వేలు ఇస్తామంటూ హామీ ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని ప్రభుత్వం తుంగలోకి తొక్కేసిందని దుయ్యబట్టారు. ఖరీఫ్ ముగిసి, రబీ వచ్చినా అన్నదాతకు పైసా కూడా అందలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు సేవలందించే ఆర్‌బీకే వ్యవస్థను ఈ ప్రభుత్వం నీరుగార్చిందని దుయ్యబట్టారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు గత ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా అందేవని, ఈ సేవలు ఇప్పుడు కనుమరుగయ్యాయన్నారు. విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను మోసగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటివరకు విద్యార్థులకు వసతి దీవెన, విద్యా దీవెన పథకాలు అందించలేదన్నారు. ఈ మేరకు పెద్దఎత్తున ప్రజల తరఫున పోరాటం చేస్తున్నామని, అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, మునకలవలస సర్పంచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం



వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న పార్టీ నాయకులు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని అమ్మిగారి కోనేరు గట్టు వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఉన్న ముసుగును వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం తొలగించి, పాలాభిషేకం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసినా బొబ్బిలి, బాడంగి మండలాల్లో పలుచోట్ల వైఎస్సార్ విగ్రహాలకు వేసిన ముసుగు తొలగించలేదని ఈ నెల 10వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్పందించారు. మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఖాన్, ఉదయ్‌కిరణ్ తదితరులు కలిసి ముసుగు తీసేసి, క్షీరాభిషేకం చేసి అభిమానం చాటుకున్నారు.